తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
గురువారం
17 సెప్టెంబర్ 2026
పేజీలు : 8



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి : ఐటిడిఏ పిఓ రాహుల్

○అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా.. అనర్హుల పేర్లు జాబితాలోకి రాకుండా చూడాలి..
○ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు సమర్థవంతంగా పూర్తి చేయాలి..

**మణుగూరు,సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని పినపాక నియోజకవర్గం ఈ ఆర్ ఓ , ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు.బుధవారం మణుగూరు లోని సమితి సింగారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించిన అనంతరం మణుగూరు తహసిల్దార్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సర్ ఓటర్ నమోదు ప్రక్రియ పై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు నోటీసుల జారీ, నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు.

**ఓటర్ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలి.:**
అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగి పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు సమగ్ర పరిశీలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి ఆ హక్కు లభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నిరంతర పర్యవేక్షణ :**
ఓటర్లకు నోటీసు అందజేసిన అనంతరం సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) తప్పనిసరిగా అందజేసినట్లు రసీదును యాప్‌లో నమోదు చేయాలని, రసీదు వివరాలు యాప్‌లో నమోదు చేసిన తర్వాతనే సంబంధిత నోటీసు అందజేత పూర్తయినట్లుగా పరిగణించాలని పేర్కొన్నారు. మిగిలిన నోటీసుల పంపిణీపై క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఓటర్లకి అవగాహన కల్పించాలి:**
పినపాక నియోజకవర్గంలో434 మందికి విచారణకు పిలిచిన వారిలో దాదాపు 60 శాతం మంది హాజరవుతుండగా, హాజరవుతున్న వారిలో 30 నుంచి 40 శాతం మంది సరైన ధ్రువపత్రాలు లేకుండా వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ నేపథ్యంలో విచారణ తేదీకి ముందుగానే సంబంధిత ఓటర్లకు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఓటర్లు అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యేలా బీఎల్ఓలు, బీఎల్ఏల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.బీఎల్ఓలు, బీఎల్ఏలు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఇంటినీ సందర్శించి, సంబంధిత ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సహకారం అందించేలా బీఎల్ఓల పనితీరును అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలి:**
అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు నిరాకరించబడకుండా చూడటంతో పాటు, అర్హత లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఓటర్ల పేర్ల తొలగింపుకు సంబంధించిన ప్రతి కేసును నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి, కారణాలను స్పష్టంగా నమోదు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు.





పుట్టిన తేదీ, వయస్సు తదితర వివరాల నిర్ధారణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను ఓటర్లు సమర్పించేలా అధికారులు బి ఎల్ వో లకు సూచించాలని, ఓటరు పేరు లేదా ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో తగిన ఆధారాలు అందుబాటులో లేనట్లయితే, నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన, పంచనామా తదితర అవసరమైన ప్రక్రియలను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎలక్షన్ డి?టీ? అనూష, రామారావు, ఆర్ రమేష్, సంసింగారం సర్పంచ్ మాధవరావు ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయి భూమే ప్రమాణికం

### కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 16( జనంసాక్షి )** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే విధానం, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ×, భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి వివరాలకు రికార్డుల్లోని మిగతా 2లో

## ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 ( జనంసాక్షి):** అర్హులైన ప్రతిఒక్క ఓటరు తుది జాబితాలో స్థానం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సవరించిన షెడ్యూల్, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు వ్యవధి ఆగస్టు 17 నుండి నుండి అక్టోబర్ 7 వరకు ఉందన్నారు. నోటీసుల డిస్పోజల్, అపీళ్ల పరిష్కారానికి నవంబర్ 5 వరకు గడువు ఉండి, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు.నూతనంగా ఓటరు నమోదు కోసం ఫారమ్ 6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ కాపీని



తప్పనిసరిగా జతచేయాలని కలెక్టర్ తెలిపారు. ఫిజికల్ హియరింగ్ సమయంలో దరఖాస్తుదారులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,60,623 నోటీసుల పంపిణీ చేసి, 91.34 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇప్పటివరకు 81,446 మందికి విచారణ పూర్తి చేసి, దరఖాస్తులను దరఖాస్తులు పరిష్కరించామన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 12,000 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం నగర పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన పట్టణ ఓటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల దాదాపు 9,000 నుండి 12,000 వరకు నోటీసుల పంపిణీకి ఇబ్బంది ఎదురవుతోందన్నారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు వార్తా లోపలి పేజీలో

## దరఖాస్తులకు సెప్టెంబర్ 30 చివరి గడువు

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లాలోని వెనుకబడిన తరగతుల (బీసీ) కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ' పథకాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎ. సంజీవయ్య తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు.అర్హులైన మహిళలు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు సెప్టెంబర్ 30, 2026 చివరి తేదీ అని తెలిపారు.

**అర్హతలు:**
18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. నిరుద్యోగ, పేద మహిళలతో పాటు వితంతు, ఒంటరి, వికలాంగ, అనాథ మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలి. కనీస అక్షరాస్యతతో పాటు 5వ తరగతి ఉత్తీర్ణతకు




అవకాశం ఉంది.అభ్యర్థులు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర అవసరమైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలి. 2023-24లో బీసీ వొకేషనల్ స్కీమ్ స్వయం ఉపాధి పథకం కింద వార్తా లోపలి పేజీలో

## తుమ్మలచెరువును వెంటనే నింపాలి

### మోటార్లు సిద్ధంగా ఉన్నా నీటి విడుదలలో జాప్యం ఎందుకు?



**అశ్వాపురం సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** మారెళ్లపాడు వద్ద సిద్ధంగా ఉన్న రెండు మోటార్లను వెంటనే ఆన్ చేసి తుమ్మల చెరువును గోదావరి జలాలతో యుద్ధప్రాతిపదికన నింపాలని పీఏసీఎస్ నెల్లిపాక మాజీ అధ్యక్షులు మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మోటార్లకు ట్రయల్ రన్ నిర్వహించి పది రోజులు కావస్తున్నా నీటి విడుదలలో జాప్యం చేయడం వల్ల మూడు కాలువల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుమ్మలచెరువులో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అధికారులు ఇకపై కాలయాపన చేయకుండా తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. చెరువును నింపితేనే ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని మర్రి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ప్రపంచ బార్బర్స్ డే జెండా ఆవిష్కరణ



**భద్రాచలం సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** ప్రపంచ బార్బర్స్ డే సందర్భంగా భద్రాచలం టౌన్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భద్రాచలం టౌన్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జంపాల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణుల ఐక్యత, సంఘటిత శక్తి, వృత్తిపరమైన అభివృద్ధి, సామాజిక సేవ వంటి అంశాలపై నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర శ్రీను, భద్రాచలం టౌన్ గౌరవ అధ్యక్షుడు మార్కాపురం వెంకన్న, అడ్డగూడూరు సత్యనారాయణ, టౌన్ ప్రధాన కార్యదర్శి సోమనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి ఎల్లమందల ఉపేందర్, భద్రాచలం డివిజన్ గౌరవ అధ్యక్షుడు మార్కాపురం సీతారాములు, డివిజన్ అధ్యక్షుడు అనుదుర్తి క్రాంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ అందుర్తి రాజకుమార్, ఉపాధ్యక్షుడు కేటి వెంకట్, సహాయ కార్యదర్శి కొండేటి పెద్దిరాజు, అందుర్తి సాయి పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 16:(జనంసాక్షి )** ఏదులాపురం మున్సిపాలిటీ 29వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దినేని ప్రసాద్, వెంపటి రవి, నల్లబోలు అనితారెడ్డి, వడ్లకొండ భుజంగరావు, బొడ్డు హర్షవర్ధన్, ఏపూరి తరుణ్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయి భూమే ప్రమాణికం:కలెక్టర్ దివాకర టిఎస్

వివరాలకు పొంతన లేని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

భూ రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అన్నారు.

పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం మధ్య తేడా ఉందా లేదా అనే విషయాన్ని చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి నిర్ధారించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, విస్తీర్ణంలో ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే అందుకు గల కారణాలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని అన్నారు.

ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

రికార్డుల్లో ఉన్న వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు మధ్య ఉన్న విస్తీర్ణ తేడాలను సాంకేతికంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని అన్నారు.

ఆధునిక రోవర్, ట్యాబ్ తదితర సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన భూ యజమానులు, సాగుదారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించే విధంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందేలా రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సంబంధిత పత్రాలను అధికారులకు అందజేస్తూ పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదకుటుంబాన్ని ఆదుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### నిమ్స్ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం 2.50 లక్షల ఎల్ఓసి బాధిత కుటుంబానికి అందజేత




**కల్లూరు సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** నిరుపేద కుటుంబానికి చెందిన బొల్లెపోగు గురవయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మెరుగైన వైద్య సేవలు పొందేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచి హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో ఆపరేషన్ మెరుగైన వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిది నుండి 2.50 లక్షల ఎల్ వో సి అందించిఆదుకున్నారు. కల్లూరు మండల పరిధి బత్తులపల్లి గ్రామానికి చెందిన బొల్లెపోగు గురవయ్య కు ఇటీవల

5 రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన అతన్ని ఖమ్మం లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించి వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమంగా ఉండటం తో ఈ విషయాన్ని బత్తులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లక్కిరెడ్డి ఎసురెడ్డి, జంగా పిచ్చి రెడ్డి, పొదిలి వెంకటేశ్వర్లు, కొర్ర నరసింహ, గ్రామ సర్పంచ్ గుగులోతు ఉమారాణి, నాగరాజు, రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతోస్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే నిమ్స్ హాస్పిటల్ లో వెంటిలేటర్ బెడ్ ఏర్పాటు చేపించి, అడ్మిట్ చేయించారు. ఆపరేషన్ కు అవసరమైన రూ 2.50 లక్షల ఎల్ ఓ సి ని మంత్రి ఆదేశాల మేరకు స్వయానా మంత్రి పిఎ ఏర్పాటు చేసారు. ఆపదలో ఆదుకొని తమకు వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఎల్ఓసి అందించి, నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సల కోసం మానవత్వంతో స్పందించి సహకారం అందించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బత్తులపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దరఖాస్తులకు సెప్టెంబర్ 30 చివరి గడువు

ఆర్థిక లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం కుల, ఆదాయ, నివాస, ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత, టైలరింగ్ శిక్షణ లేదా అనుభవ ధ్రువీకరణ పత్రాలను జతచేసి గ్రామీణ ప్రాంతాల వారు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కమిషనర్లకు సెప్టెంబర్ 30లోగా సమర్పించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎ. సంజీవయ్య సూచించారు.

## ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

క్రియాశీలకంగా పాల్గొని సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహించినప్పుడు మెజారిటీ ప్రజలు పదవ తరగతి సర్టిఫికేట్లను ఆధారాలుగా చూపుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో కుల ధృవీకరణ పత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. ధ్రువీకరణ పత్రాల జారీపై అధికారు లకు ఆదేశాలిచ్చామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## షోయబుల్లా ఖాన్ కు ఘన నివాళులు



**ఖమ్మం, సెప్టెంబరు 16 ( జనంసాక్షి )** నిజాం పాలన, ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జర్నలిజాన్ని ఆయుధంగా మలుచుకుని పోరాడి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ త్యాగాలను స్మరించుకుంటూబీజేపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని సుబ్లేడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల కోసం కలాన్ని ఆయుధంగా మలిచి. నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న నిర్బంధం, రజాకార్ల అకృత్యాలపై షోయబుల్లా ఖాన్ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి బలిదానం చేసిన ఆయనను స్ఫూర్తిదాయక పాత్రికేయుడిగా కొనియాడారు.

జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని, అన్యాయాన్ని ప్రశ్నించేందుకు కలం కూడా శక్తిమంతమైన ఆయుధమేనని షోయబుల్లా ఖాన్ తన జీవితంతో నిరూపించారని, ప్రజల కోసం పనిచేసిన ఆయన త్యాగాన్ని నేటితరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖమ్మం జిల్లా భాజపా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, భాజపా కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రవికుమార్ నున్న, రాష్ట్ర నాయకుడు రుద్ర ప్రదీప్, శామ్ రాథోడ్, తక్కెళ్లపల్లి నరేంద్రరావు, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణసాగర్ ఐటీఐలో 18న అప్రెంటిస్‌షిప్ మేళా



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** ప్రభుత్వ ఆర్ఐటీఐ బూర్గంపహాడ్ మడలం కృష్ణసాగర్‌లో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ ఇండియా వెబ్‌సైట్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకుని, బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో మేళాకు హాజరు కావాలని సూచించారు. ఐటీసీ పేపర్‌బోర్డ్, ఫిమాకెమ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, మేధా సర్వో డ్రైవ్, డైనమిక్ టూల్స్ తదితర సంస్థల ప్రతినిధులు మేళాకు హాజరుకానున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నారాయణపురంలో డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పర్యటన



**-ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు**

**- రైతులతో ముచ్చట**

**- గణేష్ మండపాల సందర్శన**

**కల్లూరు సెప్టెంబర్ 16(జనం సాక్షి)**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు?కర్ణాటక రాష్ట్రాల పార్టీ వ్యవహారాల సహ ఇన్‌చార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తన సతీమణి గీతారెడ్డి తో కలిసి బుధవారం తన స్వగ్రామమైన కల్లూరు మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ఆయన, అక్కడ నిర్మించిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజలు, తెలంగాణ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామదేవతను ప్రార్థించారు.

**రైతులతో ఆత్మీయంగా ముచ్చట**

పూజల అనంతరం వ్యవసాయ క్షేత్రంలో స్థానిక రైతులతో డాక్టర్ సుధాకర్ రెడ్డి ఆత్మీయంగా ముచ్చటించారు. రైతుల పంటల పరిస్థితి, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పీఎం కిసాన్ తదితర కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు, వ్యవసాయ రంగానికి అందిస్తున్న సహాయంపై కూడా ఆయన రైతులతో చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు**

అనంతరం నారాయణపురంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించిన డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు.గ్రామ యువజనులు ఏర్పాటు చేసిన వివిధ గణేష్ మండపాలను సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. యువజనులతో ఆత్మీయంగా మాట్లాడి, భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న వారిని అభినందించారు.

**మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంపర్క్ అభియాన్**

ఈ సందర్భంగా డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు "సేవా సంపర్క్ అభియాన్" ద్వారా నెలరోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండి దేశాన్ని మరింత అభివృద్ధి, శుభిక్షం, సంక్షేమం వైపు నడిపించాలని ముత్యాలమ్మ తల్లిని ప్రార్థించాను. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం రైతులు, పేదలు, మహిళలు, యువత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది" అని అన్నారు.రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై భారతీయ జనతా పార్టీ కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సేవే బీజేపీ సిద్ధాంతం ? ప్రజా సంక్షేమమే లక్ష్యం అనే నినాదంతో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని డాక్టర్ పొంగులేటిసుధాకర్ రెడ్డి సూచించారు ఈ కార్యక్రమంలో కల్లూరు మండల బిజెపి అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఆనంగి నరసింహారావు మండల ఉపాధ్యక్షులు చెన్ను వెంకటేశ్వరరావు మండల కార్యదర్శి బొడ్డు నాగరాజు నాయకులు, పసుపులేటి సుబ్బారావు కృష్ణమాచారి వెంకటరామారావు జరపుల నాగులు గుండపనేని అనిల్, వినయ్ కుమార్ వంగల శ్రీనివాసరావు రంగురవి రాచ బంటి శ్రీను కార్యకర్తలు, రైతులు, యువజనులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లు చెరువులో జలసిరికి శ్రీకారం

**- లక్ష చేప పిల్లల విడుదల.. మత్స్యకారులకు ఉపాధే లక్ష్యం**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ లోని కొల్లు చెరువులో మత్స్యసంపద అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘం సభ్యులు బుధవారం కొల్లు చెరువులో లక్ష చేప పిల్లలను విడుదల చేశారు.చెరువులో చేపల ఉత్పత్తిని పెంచి స్థానిక మత్స్య కారులకు ఉపాధి, ఆదాయ అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేప పిల్లలను విడుదల చేసినట్లు మత్స్య సహకార సంఘం సభ్యులు తెలిపారు. చేప పిల్లలు పెరిగి మత్స్యసంపద సమృద్ధిగా లభిస్తే మత్స్యకార కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

**- అక్రమ చేపల వేటపై హెచ్చరిక.**

కొల్లు చెరువులో చేపల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సభ్యులు తెలిపారు. చెరువులో గాలాలు వేసి చేపలు పట్టడం పూర్తిగా నిషేధమని, నిబంధనలను ఉల్లంఘించి చేపలు పట్టే వారిపై నిబంధనల ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. చెరువులో విడుదల చేసిన చేప పిల్లలను సంరక్షించడం అందరి బాధ్యతని, మత్స్యసంపద అభివృద్ధికి స్థానికులు సహకరించాలని మత్స్య సహకార సంఘం సభ్యులు కోరారు.

## చేయూత పింఛన్ దరఖాస్తులపై ఇంటింటా పరిశీలన

అశ్వాపురం సెప్టెంబర్ 16 (జనంసాక్షి):



చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను నిర్ధారించేందుకు గొందిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం ఇంటింటా వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. అశ్వాపురం ఎంపీడీవో, వెరిఫికేషన్ అధికారి ముత్యాలరావు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలతో పాటు సమర్పించిన అర్హత పత్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలు, పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి పారదర్శకంగా అందేలా అర్హతల పరిశీలన చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కే. గంగయ్య, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రావు, మండల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షౌర వృత్తికి రక్షణ కల్పించాలి

**నాయీబ్రాహ్మణులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలి**

**కార్పొరేట్ సెలూన్లు, బ్యూటీ పార్లర్లతో సంప్రదాయ వృత్తికి గండి**

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 16, (జనంసాక్షి):**

నాయీబ్రాహ్మణుల సంప్రదాయ క్షౌర వృత్తికి రక్షణ కల్పించి, ఆ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు కోమరవెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. క్షౌర వృత్తిదారుల జీవనోపాధికి ఇబ్బందులు కలిగిస్తున్న కార్పొరేట్ తరహా సెలూన్లు, బ్యూటీ పార్లర్ల అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రపంచ బార్బర్స్ డేను పురస్కరించుకుని బుధవారం ఉదయం 9 గంటలకు పాల్వంచలోని స్థానిక బీసీ అసోసియేషన్ హాల్‌లో పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఉప్పెర్ల పుల్లారావు అధ్యక్షతన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కె. మురళీకృష్ణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు కోమరవెల్లి రవీందర్ హాజరయ్యారు.ముందుగా నాయీబ్రాహ్మణుల మూలపురుషుడిగా భావించే ధన్వంతరి వైద్య నాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కోమరవెల్లి రవీందర్ నాయీబ్రాహ్మణ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రాంతాలకు చెందిన సుమారు వంద మంది నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోమరవెల్లి రవీందర్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఐక్యంగా, సామరస్యంగా, శాంతియుతంగా ముందుకు సాగుతూ తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఉప్పెర్ల పుల్లారావు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘటితంగా ముందుకు సాగుతూ సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు దేవరకొండ శ్రీనివాసరావు, జంబల వెంకన్నతో పాటు సోమురాజుపల్లి బాలకృష్ణ, శ్రీరాముల ప్రకాష్, శ్యామల శ్రీనివాస్, చందనవాడ శైమల్‌రావు, మురళి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నాలు తొలిగించి విజయాలు సాధించాలి

**శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం..**

**గణనాధున్ని దర్శించుకున్న తహసిల్దార్ నరేష్, సీఐ నాగబాబు..**

**మణుగూరు సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**

విఘ్నాలు తొలిగించి విజయాలు కలిగించి, ఆర్థిక వృద్ధి కలగాలని శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనం సమీపంలో కొలువైన గణాధిపతుడికి పంచమ నవరాత్రి మహోత్సవములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిత్య పూజలో భాగంగా దేవరకొండ నరసింహాచారి, లలిత దంపతులు, కనుకు రమేష్, సంధ్యా దంపతులు పీటలమీద కూర్చొని, వివిధ రకాల పుష్పాలు, పంచామృతాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. లంబోధరుడుకు ఇష్టమైన ఉండ్రాళ్ళు, పాయసం, పులిహోర, సెనగలు వంటి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం తిలకించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు మాట్లాడుతూ.. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుని వేడుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక చవితిని మూడు రోజులు వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఆహ్లాదకరంగా భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గణనాధుని కృప ఎల్లవేళలా కమిటీ సభ్యులపై, ప్రజలందరిపై ఉండాలని తమకు సేవ చేసుకునే భాగ్యం ప్రతి సంవత్సరం కలగాలని ఏకదంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం మహా అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదంను స్వీకరించారు. నేడు జరిగే లడ్డు వేలంపాట అనంతరం గణేష్ నిమజ్జనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేయాలని శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.









**గణపతిని దర్శించుకున్న అధికారులు:**

గణపతి ఉత్సవాలలో భాగంగా మణుగూరు మండలం అశోక్ నగర్ లోని కొలువై ఉన్న గణనాధుని మణుగూరు మండల తహసిల్దార్ అద్దంకి నరేష్ ,సీఐ నాగబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుల మతాలకతీతంగా అందరూ కలిసి నుంచి ఆనందంగా ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. డీజే శబ్దాల వల్ల ఎన్నో ప్రాణాలు కోల్పోతున్నారు. నిబంధన మేరకు డిజీ? లను ఉపయోగించాలని అన్నారు. నిమజ్జన సమయంలో కరెంటు తీగలు తగలకుండా జాగ్రత్త వహించి రక్షణతో కూడిన నిమజ్జనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి రామారావు పారే రమేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పెనుబల్లి మండలం ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఏర్పాటు

### అధ్యక్షులుగా ఉప సర్పంచ్ తాళ్లూరి రవి

**పెనుబల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**

ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ ఆదేశాల ప్రకారం ఖమ్మం జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు జెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పెనుబల్లి మండలం ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా వీఎం బంజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తాళ్లూరి రవిని అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా అడవి మల్లెల ఉపసర్పంచ్ తేళ్ల ఆనందరావు ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మందపాటి వెంకటరెడ్డి, చీకటి అజిత్, దొడ్డపునేను రవి, కావిటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు- 16( జనంసాక్షి )**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆర్టీసీ బస్సులు ఆపాలి

### వైద్యులు,ఆసుపత్రి సిబ్బంది..

### రోడ్డుపైనిరసన వ్యక్తం చేసిన సిబ్బంది తో పాటు వైద్యులు

**పెనుబల్లి సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**

పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రిక్వెస్ట్ బస్సు స్టాప్ ఏర్పాటుచేసిన బస్సులు ఆపడం లేదని బుధవారం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రహదారి పైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుండి ఆసుపత్రికి వచ్చే సిబ్బంది, రోగులకు ఆసుపత్రి ఎదుట ఆర్టీసీబస్సులుఆపకపోవడంతోతీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో మేనేజర్ కు తమ సమస్యను పలుమార్లు వివరించామని, మేనేజర్ స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బస్సులు ఆపి సిబ్బందికి, ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారని, అయినప్పటికీ బస్సులు ఆస్పత్రి ఎదుట ఆగకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. డిపో మేనేజర్ తక్షణమే స్పందించి ఆసుపత్రి ఎదుట బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

## గుర్తుతెలియని రెండు మృతదేహాలకు అంత్యక్రియలు చేసిన అన్నం ఫౌండేషన్

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచిన రెండు గుర్తుతెలియని మృతదేహాలకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రూరల్ పోలీస్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అత్యవసర వైద్య సేవల ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతిచెందడంతో ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. అదేవిధంగా ఖమ్మం అర్బన్ పోలీస్ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీ గుంతలోని నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. మృతదేహం కొంతకాలంగా నీటిలో ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉండగా, పోలీసులు దానిని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ రెండు మృతదేహాల కోసం కొంతకాలం ఎదురుచూసినప్పటికీ బంధువులు లేదా కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు వాటిని అనాథ మృతదేహాలుగా గుర్తించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్నం ఫౌండేషన్‌కు లిఖితపూర్వకంగా అనుమతి పత్రాలు అందజేశారు. పోలీసుల నుంచి సమాచారం అందిన వెంటనే స్పందించిన అన్నం ఫౌండేషన్ ప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి చేరుకున్నారు. పోలీసులు, మార్చురీ సిబ్బంది సమక్షంలో రెండు మృతదేహాలను స్వీకరించి, తెల్లని వస్త్రాలతో చుట్టి, పూలు, పూలమాలలతో గౌరవించారు. అనంతరం మృతదేహాలను మల్లేపల్లి వైకుంఠ గ్రామానికి తరలించి గౌరవప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధికి మరో అడుగు..

### - కృష్ణసాగర్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**

గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీసీసీ స్టోర్ బజార్ వద్ద చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ తాటి వాణి శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పించడంతో పాటు, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని సర్పంచ్ తాటి వాణి పేర్కొన్నారు.“అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగిస్తూ.. కృష్ణసాగర్ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం” అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్యా మోహన్‌రావు, ఎంపీడీవో జమాలా రెడ్డి, పీఆర్ఏఈ చారి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం. నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం సురేష్, రెండో వార్డు సభ్యుడు ఉసిల్ల రాజేష్, మూడో వార్డు సభ్యురాలు అంతోటి కృష్ణలీల, ఎనిమిదో వార్డు సభ్యుడు పద్దం రాజు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## నేటితో క్వాలిఫై ముగింపు.. రేపటి నుంచి అసలు సమరం!

### శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో

### జంట నగరాల్లో టెన్నిస్ సందడి

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్16 (జనంసాక్షి):**

పాల్వంచ?కొత్తగూడెం జంట నగరాల వేదికగా జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వాలిఫై మ్యాచ్‌లు నేటితో ముగియనున్నాయి. రేపటి నుంచి ప్రధాన పోటీలు ప్రారంభం కానుండటంతో క్రీడాభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీనియర్ క్రీడాకారులు వయసు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ ఉత్సాహంగా పోటీపడుతున్నారు. జాతీయ స్థాయి క్రీడాకారుల ఆటతీరును ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉండటంతో జిల్లా ప్రజలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మ్యాచ్‌లను తిలకించాలని నిర్వాహకులు కోరుతున్నారు. దేశవ్యాప్తంగా క్రీడాకారులను పాల్వంచ?కొత్తగూడెం వేదికకు తీసుకురావడంలో ప్రత్యేకంగా సహకరిస్తున్న శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఔ సురేష్ రెడ్డి ( ఎన్ ఎస్ ఆర్) కి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాల్వంచలో మూడు, కొత్తగూడెంలో ఒక వేదికపై మ్యాచ్‌లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు నిర్వాహకులు పలు బృందాలుగా ఏర్పడి సమన్వయంతో కృషి చేస్తున్నారు. నేటితో క్వాలిఫై మ్యాచ్‌లకు తెరపడనుండగా.. రేపటి నుంచి టెన్నిస్ అసలు సమరం ప్రారంభం కానుంది.



## భద్రాద్రి రామయ్య నిత్యన్నదానానికి రూ.లక్ష విరాళం

### - కనులపండువగా సీతారాముల నిత్య కల్యాణోత్సవం

**భద్రాచలం సెప్టెంబరు 16 (జనంసాక్షి)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో బుధవారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు జరిగాయి. ఆలయంలో నిరంతరం కొనసాగే నిత్యన్నదాన పథకానికి పాల్వంచ పట్టణానికి చెందిన భక్తుడు జరగబన వెంకన్న రూ.1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) లేదా నగదును ఆలయ అధికారులకు అందజేయగా, వారు దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

**- వైభవంగా నిత్య కల్యాణం..**

రామాలయంలో స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవం కనులపండువగా సాగింది. అర్చకులు శాస్త్రోక్తంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవాచనంతో పూజా



క్రతువును ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కంకణధారణ, జీలకర్ర-బెల్లం సమర్పణ, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య సీతారాముల కల్యాణం దివ్యంగా పూర్తయింది. వేడుక ముగింపులో అర్చకులు భక్తులకు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.



## ఆర్థిక సహాయం అందజేత

సూర్యాపేట (జనంసాక్షి):
ఆర్యవైశ్య నిరుపేద కుటుంబానికి సూర్యాపేట ఆర్యవైశ్య మిత్రుల సహకారంతో ఆర్థిక సహాయంను బుధవారం అందజేశారు. హైదరాబాద్ కు చెందిన చల్లా పాండరయ్య, సువర్ణలు మూగవారు, వారి ఇద్దరు కుమార్తెలు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారికి సూర్యాపేట ఆర్యవైశ్య ప్రముఖులు యామా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మిత్రులు కలిసి సేకరించిన 12500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు యామా ప్రభాకర్ మాట్లాడుతూ సూర్యాపేట లో ఆర్యవైశ్యులు సేవాగుణం కలిగిన వారని, పేదవారికి ఆర్థిక సహాయం చేయడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యామా ప్రభాకర్,కలకోట లక్ష్మయ్య,పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్పి గాంధీ,నీలా శ్రీనివాస్, బెలిదె వెంకన్న, చల్లా సత్యనారాయణ,వనమా నరసింహారావు, తల్లాడ శ్రీనివాస్,బిక్కుమల్ల సంతోష్, బ్రహ్మాండపల్లి సంతోష్,బూర్లె నవీన్, శిల్ప,బ్రహ్మదేవర సోమయ్య, వుప్పల శ్రవణ్,చల్లా లక్ష్మి ప్రసాద్, చక్కా లక్ష్మయ్య,చల్లా పాండయ్య వాసా రాజశేఖర్, కొండా శ్రీనివాస రావు, బచ్చు పురుషోత్తం, నవిలిపురి నరేందర్, వుప్పలంచు కృష్ణ, చిత్తలూరి శ్రీధర్, చల్లా శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల రమేష్ మాదిగ**



**ఆత్మకూర్ (ఎం), సెప్టెంబర్ (16)జనంసాక్షి**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల రమేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ కూరెళ్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కూరెళ్ల మచ్చగిరి ఆధ్వర్యంలో నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హమారా ప్రసాద్ పుస్తకావిష్కరణను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ డివిజన్ కమిటీకి నలుగురి ఎంపిక

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ (16)జనంసాక్షి**



ఆత్మ తుంగతుర్తి డివిజన్ కమిటీకి జాజిరెడ్డిగూడెం మండలం నుంచి నలుగురికి చోటు దక్కింది. జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ వెంకటేశ్వర్లు గౌడ్, రామన్నగూడెంనకు చెందిన వజ్జే చిన్నవీరయ్య, తిమ్మాపురం నకు చెందిన మారం కోటిరెడ్డి, కాసర్లపాడు గ్రామానికి చెందిన బద్దవ యాదగిరి గౌడ్ లను ఎమ్మెల్యే సామేలు నియమించారు. తమని నియమించిన ఎమ్మెల్యే సామేలుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మానవత్వాన్ని చాటుకున్న ప్రెస్ క్లబ్



**కోదాడ,( జనం సాక్షి):**
కోదాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రక్కన చెరువు కట్ట బజారులో వున్న ఎండి రహమత్ వెన్నుపూస సమస్య, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఒక నిరుపేద ఇంటి యజమాని కుటుంబానికి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో, దాతలు మేళ్లచెరువు గ్రామానికి చెందిన ఎస్టిఆర్ బాలు, కోదాడ పట్టణంలోని రామాలయం గుడి అర్చకులు కాండూరి వంశీకృష్ణ చార్యుల సహకారంతో నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు.తీవ్ర అనారోగ్యం కారణంగా ఎండి నుస్రత్ఉపాధి కోల్పోయి, కుటుంబ పోషణ భారంగా మారిన విషయాన్ని ప్రెస్ క్లబ్ సభ్యులు గుర్తించారు.ఈ క్రమంలో దాతల సహాయాన్ని కూడగట్టి,ఆ కుటుంబానికి అండగా నిలిచారు. వారికి నెల రోజులకు సరిపడా బియ్యం (రైస్) తో పాటు వంట నూనె, పప్పులు, కారం, ఉప్పు వంటి వివిధ రకాల కిరాణా సరుకులను ప్రెస్ క్లబ్ ప్రతినిధులు స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం అంజి మాట్లాడుతూ.. సమాజంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యతని, అనారోగ్యంతో ఉన్న ఆ కుటుంబానికి తమ వంతు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. తమ పిలుపునకు స్పందించి సరుకుల పంపిణీకి సహకరించిన దాతలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమకు సరుకులు అందించి ఆదుకున్నందుకు ఎండి రహమత్ నిరుపేద కుటుంబ సభ్యులు ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు, దాతలకు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాణాల అబ్రహము ప్రధాన కార్యదర్శి బండారు నాగరాజు కోశాధికారి నూరుద్దీన్ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, జగన్మోహన్రావు, రహీం, వెంకటేశ్వర్లు, రమేష్, గోపీచంద్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**మునగాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):**
మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన జడిగల మంగయ్య ఇటీవల మండల కేంద్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించగా బుధవారం నేలమర్రి గ్రామంలో మంగయ్య నివాసంలో జరిగిన జడిగల మంగయ్య దశదినకర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని మంగయ్యచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల్ని ఓదార్చి తీవ్ర సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. అదేవిధంగా నేలమర్రి గ్రామానికి చెందిన గంగరబోయిన వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తన ఇంటి వద్ద వైద్యం చేయించుకుంటున్న వెంకన్నను మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేలమర్రి గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ముత్యాలమ్మ యూత్ ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని ఆయన సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, నేలమర్రి గ్రామ సర్పంచ్ రాంపగు సుందరయ్య, మాజీ జెడ్పిటిసి కోల ఉపేందర్, నర్రా వెంకటరెడ్డి, లచ్చిరెడ్డి, గడ్డం లింగయ్య, ఎల్పి రామయ్య, కాపర్తి మణికంఠ కుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదవారికి అండగా వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ నిలవాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**



పేదవారికి సేవ చేయడంలో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ ముందుండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మొరిశెట్టి లక్షాది, డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇబ్బందులు పడుతుంటారని,అలాంటి పేదవారికి అండగా ఉండడానికి వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు.ప్రతి ఒక్కరూ సేవాగుణంను అలవర్చుకోవాలని అన్నారు.వారాహి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మహంకాళి రవీందర్ రావు మాట్లాడుతూ ప్రప్రథమంగా పేద ప్రజలకు సేవలు అందించుటకు సూర్యాపేటలో తమ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.రాబోయే రోజుల్లో వారాహి హెల్పింగ్ హాండ్స్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల చంద్రశేఖర్,గౌరవ సలహాదారులు రాచకొండ శ్రీనివాస్,ఉపాధ్యక్షులు చల్లా సత్యనారాయణ, కార్యదర్శి ఖమ్మంపాటి రేణుబాబు, కోశాధికారి బచ్చు పురుషోత్తం, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్, ఈసీ సభ్యులు మొలుగూరి శోభారాణి, పల్లెల ప్రసాద్ రావు, సుంకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుధారాణి, అమరేందర్ రెడ్డి, బొడ్డుపల్లి సతీష్, గజ్జి నవీన్,ఉయ్యాల నర్సయ్య, మామిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్

**విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు**

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
ఫార్మసీ విద్య విద్యార్థుల ఉన్నత కెరీర్‌కు బలమైన పునాది వేస్తుందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు అన్నారు. దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీ–ఫార్మసీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. ఫార్మసీ పూర్తిచేసిన వారికి ఆస్పత్రులు, పరిశోధన, ఔషధ తయారీ, ప్రభుత్వ రంగాల్లో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో కెరీర్‌లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస మూర్తి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు



**ఆత్మకూర్ (ఎం), సెప్టెంబర్ 16 జనంసాక్షి :**
మండలంలోని కొరటికల్ గ్రామం లో ని బీసీ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ కట్టెకోల సుశీల హనుమంత్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ మురారిశెట్టి సురేష్, రోజా గుప్త, కట్టెకోల రమాదేవి, రమేష్ గౌడ్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## టీ పీ సీ సీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టం

జాజిరెడ్డిగూడెం మండల **సెప్టెంబర్ 16 జనంసాక్షి :**
టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పటిష్టంగా మారిందని తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం హైదరాబాదులో హైదరాబాదులో ఆయనను ఘనంగా సన్మానించారు. టిపిసిసి అధ్యక్షుడిగా ఎమ్మెల్సీగా నిబద్ధత పనిచేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# నేరేడుచర్ల మండల స్థాయి సమావేశంలో వాగ్వాదం

❑ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాప్యంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

❑అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్

**నేరేడుచర్ల సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :**
నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, సర్పంచులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరుగుతున్న జాప్యంపై అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది.

**అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి**

పెంచికల్‌దిన్న, దాచారం గ్రామాల సర్పంచులు సమావేశం దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరారు. అర్హత ఉన్నప్పటికీ ఇళ్ల మంజూరులో జాప్యం జరుగుతుండటంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

**సగం మంది సర్పంచులు గైర్హాజరు.**

మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరగాల్సిన సమావేశానికి సగం మంది సర్పంచులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కొద్దిమంది ప్రజాప్రతినిధులు, కొద్దిమంది శాఖాధికారుల సమక్షంలోనే సమావేశం కొనసాగింది.

**మహిళా సర్పంచ్ స్థానంలో భర్త హాజరు?**

అధికారిక సమావేశానికి మహిళా సర్పంచ్ హాజరు కావాల్సి ఉండగా, ఆమె స్థానంలో భర్త సమావేశంలో పాల్గొనడం కూడా చర్చకు దారితీసింది. ప్రజాప్రతినిధుల హాజరు, అధికారిక సమావేశాల్లో వారి ప్రత్యక్ష భాగస్వామ్యంపై పలువురు ప్రశ్నలు వ్యక్తం చేశారు.

**ఎజెండా లేకుండానే సమావేశం ముగింపు**

మండలంలోని 19 గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రజా సమస్యలపై సమీక్షించాల్సిన సమావేశం స్పష్టమైన ఎజెండా లేకుండానే ముగిసిందనే విమర్శలు వినిపించాయి. కీలకమైన మండల స్థాయి సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయిలో





హాజరై గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించాలని పలువురు కోరుతున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సైదులు, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి పర్యటనను జయప్రదం చేయండి

### గడ్డం వేణుగోపాల్ రెడ్డి



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండలంలో చెరువుపల్లి, దాచారం గ్రామాలకు సంబంధించి నిర్వహించనున్న రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతి నిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మాడుగులపల్లి మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి ప్రకటనలో కోరారు మండలంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ శంకుస్థాపన కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రతి వర్షపు చుక్కనూ భద్రపరుద్దాం

- ఎస్.లింగోటంలో ఫామ్ కుంట పనులకు శ్రీకారం
- భూగర్భ జలాల పెంపునకు జలసిరి పథకం



**చౌటుప్పల్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**
వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా భూమిలోకి ఇంకింపజేస్తేనే సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కగలమని తెలంగాణ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్.లింగోటం సర్పంచ్ భీమిడి ప్రదీప్ పేర్కొన్నారు. గ్రామంలోని శివుని బావి శేల్కలో 'జలసిరి' కింద చేపట్టనున్న ఫామ్ కుంట నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "వర్షం ఎప్పుడు పడుతుందో మన చేతుల్లో లేదు కానీ.. పడిన నీటిని దాచుకోవడం మన చేతుల్లోనే ఉంది'' అని వ్యాఖ్యానించారు. ఫామ్ కుంటల ద్వారా నీటిని నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి వర్షాధార రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, గ్రామ సెక్రటరీ మచ్చగిరి, వార్డు సభ్యులు ఉప్పు వీరేశం, పిట్టల సదానందం, శోభ, పల్చం శంకరయ్య, బాతరాజు లింగస్వామి, శనగోని సుశీల, తూర్పింటి సుజాత, షేగురి లింగస్వామి, రాధారపు సత్తయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మ, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహించాలి**

**300కి పైగా కంపెనీలు, వేలాది ఉద్యోగ అవకాశాలు**



**సూర్యాపేట (జనంసాక్షి):**
నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఈ నెల 19న కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సీసీఆర్ విద్యానిలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. బుధవారం సోషల్ మీడియా వారియర్స్ తో నిర్వహించిన జూమ్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో 300కు పైగా కంపెనీలు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి, యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉన్నందున యువత ఈ అవకాశాన్ని వదులుకోకుండా జాబ్ మేళాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

**చౌటుప్పల్, సెప్టెంబర్ 15(జనం సాక్షి)**
ప్రతి ఒక్కరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ మన్మథ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పాత గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన 'పోలీసు అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుట్కా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, జూదం, బెట్టింగ్ యాప్స్ మరియు సోషల్ మీడియా మోసాల బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక్కసారి కేసు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ రావని, జీవితం అంధకారమవుతుందని హెచ్చరించారు. గ్రామాన్ని మాదకద్రవ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామంలో ఎలాంటి అక్రమాలు లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు కానీ, తనకు కానీ తెలియజేయాలని కోరారు. అనంతరం సీఐ మన్మథ కుమార్, ఎస్సై నర్సిరెడ్డిలను సర్పంచ్ మల్లేష్ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, పాలం వెంకటేశం గౌడ్, ముద్దం లింగస్వామి గౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, రాపోలు రేణుక మల్లేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు పెండం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుగౌడ్, ఆంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు పర్ని శ్రీధర్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, పర్మి శ్రీనివాస్ రెడ్డి, బత్తుల జంగయ్యగౌడ్, బొమ్మని స్వామి గౌడ్, సుర్వి విజయ్ గౌడ్, యాట శంకరయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సై నర్సిరెడ్డి

## తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

**బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి మధు**

**తహసిల్దార్ రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బిజెపి మండల నాయకులు**

**పెన్ పహాడ్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17 తేదీన అధికారికంగా తెలంగాణ విమోచన దినాన్ని నిర్వహించి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరణ జరపాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి మధు తన బీజేపీ మండల కమిటీ సభ్యులతో, మండల కేంద్రం లోనీ తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రాజశేఖర్ రెడ్డికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గుడిపూరి శ్రీనివాస్, సర్పంచ్ సుందరి రామారావు, బిజెపి మండల నాయకులు మీసాల దేవయ్య, ఇసుకపల్లి రవి, గర్నె వెంకన్న, పాల్గొన్నారు.




## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

**హాలియా: జనంసాక్షి**
సెప్టెంబర్ 16 గౌరవ నల్గొండ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లలో భాగంగా, అనుముల మండల పరిధిలోని 14వ మైలు చెక్‌పోస్ట్ వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను హాలియా మున్సిపల్ చైర్మన్



చింతల చంద్రారెడ్డి గారు, మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి గారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో పూర్ణచందర్ గారు, ఎంపీడీవో మజీద్ గారు, సీఐ రాఘవరావు గారు, ఎస్సై సాయి ప్రశాంత్ గారు తదితర అధికారులు పాల్గొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు మరియు భక్తులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన భద్రతా, పారిశుద్ధ్య, మౌలిక వసతుల ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టేలా అధికారులను ఆదేశించారు.

# అధికార దుర్వినియోగానికి ప్రభుత్వ ఉద్యోగులతో ప్రచారం

- ప్రభుత్వ జాబ్ మేళానా.. ప్రైవేటు జాబ్ మేళానా.. స్పష్టం చేయాలి
- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్



**మునగాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** కోదాడ నియోజకవర్గ నిరుద్యోగ యువతరాన్ని మోసగించేందుకే సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళా ప్రకటన పేరుతో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డిలు కొత్త డ్రామాలకు తెరలేపారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ, గతంలో హుజూర్నగర్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా జాబ్ మేళా కార్యక్రమంలో వేలాదిమంది నిరుద్యోగుల్ని మోసగించి రెండురోజుల నిరుద్యోగ మేళా కార్యక్రమం పేరుతో పిలిపించి ఒక్కరోజు మాత్రమే తూతూ మంత్రంగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహణ చేసి, మరుసటి రోజు జాబ్ మేళా కార్యక్రమాన్ని వాయిదా వేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ హుజూర్నగర్ నియోజకవర్గాలలో నిరుద్యోగ యువకులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు మరలా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు తమపై ఉన్న అసంతృప్తిని తమ పాలనపై నియోజకవర్గ ప్రజల దృష్టిని మరలచేందుకు కొత్త నాటకానికి తెరతీస్తూ, కోదాడ కేంద్రముగా మెగా జాబ్ మేళా ప్రకటనతో జిల్లా అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని అధికార దుర్వినియోగాన్ని పాల్పడుతూ ఉచిత ప్రచారం నిర్వహించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భారీ నీటిపారుదల శాఖలో లస్కర్ పోస్టులను లక్షల రూపాయలకు ప్రైవేటు ఏజెన్సీ పేరుతో అక్రమంగా అమ్ముకున్న మంత్రి, ఎమ్మెల్యే అనుచరులు నేడు నిరుద్యోగులకు మెగా జాబ్ మేళా అని హడావుడి చేయడం హాస్యాస్పదమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పిన సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని .. కోదాడ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే నేటి వరకు ఎంతమందికి ఉద్యోగాలు ఇప్పించారని ఆయన ప్రశ్నించారు. అసలు మెగా జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులకు అందించే ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగమేళానా, లేదా ప్రైవేటు ఉద్యోగమేళానా అనే విషయం అధికార పార్టీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు స్పష్టం చేయాలన్నారు. ప్రైవేటు కంపెనీల వారితో ముందస్తుగా మాట్లాడుకుని వందల కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువకుల్లో ఆశలు రేకెత్తించి వేలాది మందిని మెగా జాబ్ మేళా పేరుతో మోసం చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల నిర్వాహకం గత హుజూర్నగర్ మెగాజాబ్ మేళా ద్వారా రెండు నియోజకవర్గాల లోని ప్రజలకు నిరుద్యోగయువతకు స్పష్టమైందని, దాంతో ఉత్తమ్ దంపతులు చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేనందున ,జిల్లా కలెక్టర్, ఎస్పీ నుండి గ్రామీణ స్థాయి అధికారి వరకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ మెగా జాబ్ మేళాపై ప్రచారం నిర్వహించుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే, మంత్రి వ్యక్తిగత ప్రైవేటు కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారుల నుండి గ్రామీణ స్థాయి అధికారుల వరకు ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎలాంటి ప్రభుత్వ జీవోలు మరియు రాష్ట్రస్థాయి ప్రభుత్వ అధికారుల ఆదేశాలు లేకుండా ఎందుకు బహిరంగ మైక్ ప్రచారం, మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మునగాల పిఏసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి కోల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, పార్టీ నాయకులు ఎల్విరామయ్య, గడ్డం లింగయ్య, రాయి రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 16,(జనంసాక్షి):** మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నల్గొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా డిజిటలైజ్ చేసి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.బుధవారం నల్గొండ పట్టణంలోని పచ్చల సోమేశ్వరాలయం వద్ద 1వ డివిజన్ పరిధిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నల్గొండ పట్టణంలోని 48 డివిజన్ల పరిధిలో మొత్తం 42,855 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని, వాటిని ఆయా వార్డుల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో స్మార్ట్ రేషన్ కార్డుల విధానం అమల్లోకి వచ్చిందని, దీనివల్ల రేషన్ పంపిణీలో పారదర్శకత పెరిగి అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ షాపుల ద్వారా బియ్యం పొందాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ పట్టణాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పట్టణంలో రోడ్లు, రింగ్ రోడ్డు, వాటర్ ట్యాంకులు, లతీఫ్‌సాబ్ గుట్టకు ఘాట్ రోడ్డు, అండర్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరుశురాములు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు నాగరాజు, వేణుగోపాల్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ అనిల్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

### వివరాల కోసం పోలీసుల ఆరా



**జనంసాక్షి, మిర్యాలగూడ :** నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. వేములపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోగువారిగూడెం సమీపంలో బుధవారం కాలువ నీటిలో మృతదేహం కొట్టుకురావడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి వయసు సుమారు 35?40 ఏళ్లు ఉంటుందని, బూడిద రంగు టాప్, బ్రౌన్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మహిళ ఆచూకీ తెలిసిన వారు లేదా తమ కుటుంబ సభ్యులు ఎవరైనా తప్పిపోయినట్లయితే వేములపల్లి పోలీసులను సంప్రదించాలని వేములపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు .

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

### అండ 200 మందికి భోజనాలు



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 16 ( జనంసాక్షి ):** మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన పొడపల్లి లక్ష్మమ్మ అకాల మరణం చెందారు ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఒంటిపాక వినయ్ వెంటనే స్పందించారు.విషయాన్ని మిర్యాలగూడ శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచారు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, సుమారు 200 మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేసి పంపించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి, సహకరించిన కాంగ్రెస్ నాయకులకు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## టీయూడబ్ల్యూజే చండూరు మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా ఆడెపు పరమేష్, ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల సురేష్




**చండూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) చండూరు మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్గొండ జిల్లా అధ్యక్షులు గుండెబోయిన శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చండూరు మండల టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా ఆడెపు పరమేష్ (10 టీవీ), ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల సురేష్ (నమస్తే తెలంగాణ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా, ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ హాజరయ్యారు. నల్గొండ జిల్లా అధ్యక్షులు గుండెబోయిన శంకర్ గౌడ్, నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాలింక గురుపాదం, టీయూడబ్ల్యూజే నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు పోలగోని లక్ష్మీకాంత్, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కోడి రాములు, చండూరు మండలం టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షులు బోయపల్లి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే తల్లి, బిడ్డల ఆరోగ్యం సురక్షితం

### పుల్లెంల అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణమాసం వారోత్సవాలు..



**చండూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** పోషకాహారంతోనే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, గర్భిణీలు మరియు బాలింతలు తప్పనిసరిగా సమతుల ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం చండూరు మండలంలోని పుల్లెంల గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్-3లో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యాదమ్మ మాట్లాడుతూ.. రక్తహీనతకు గురికాకుండా ఉండటానికి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, చిన్నారులకు పుట్టినప్పటి నుంచే సరైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, బాలామృతం వంటి పదార్థాలను తల్లులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ముక్కాముల వెంకన్న యాదవ్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని, పోషకాహార విలువలపై అందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీహెచ్ ఉశయ్య, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ తులసి, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు బి. ధనలక్ష్మి, ఏ. లక్ష్మమ్మ, పి. ధనలక్ష్మి మరియు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



## తనువు చాలించినబోన్ క్యాన్సర్ బాధితయువకుడు

### తల్లిదండ్రులకు కొండంత బాధను మిగిల్చివెళ్లిన కొడుకు

### భౌతిక కాయాన్ని సందర్శించిన మాజీ ఎంఎల్ఏ సండ్ర

**పెనుబల్లి సెప్టెంబర్ 16 (జనం సాక్షి)** చిన్నవయసులో ప్రమాదకరమైన బోన్ క్యాన్సర్ సోకి నిండు నూరేళ్ళు బతకాల్సిన యువకుడు అర్ధంతరంగా తనువు చాలించి తల్లిదండ్రులకు కొండంత బాధను మిగిల్చిన విషాదకర సంఘటన పెనుబల్లి మండలంలో బుదవారం చోటు చేసుకుంది. వివరాలకు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజరు గ్రామానికి చెందిన బన్నే మణికంఠ(18) కు సంవత్సరంన్నర క్రితం బోన్ క్యాన్సర్ సోకింది. తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలు ఓర్చుకొని వైద్యం చేయించారు. గత నెల క్రితం వైద్యులు మణికంఠను తమ ఇంటికి తీసుకువెళ్లమని చెప్పడంతో కొడుకును ఆఖరి దశలో తమ ఇంటి వద్దనే వైద్యం చేయించుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు, చివరకు తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేస్తూ మణికంఠ తుది శ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య మణికంఠ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు ఏ తప్పు చేయకుండానే అర్ధాంతరంగా చనిపోవడంతో తల్లిదండ్రుల బాధ చెప్పడానికి అలవి కానుంది. చిన్న వయసులోనే మణికంఠ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి . సండ్ర వెంట వెంట కనగాల వెంకటరావు, చెక్కిలాల మోహనరావు, మందడపు అశోక్ కుమార్, ఎలమర్తి శ్రీనివాసరావు, ఎలమర్తి రాంబాబు స్థానికులు ఉన్నారు.

# మైనార్టీలకు కేటాయించిన నిధులు నామ్ కే వాస్తే

## నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి:ఎండీ ఇలియాస్ పటేల్

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ ఆ నిధుల వినియోగం మాత్రం ఆశించిన స్థాయిలో లేదని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎండీ ఇలియాస్ పటేల్ ఆరోపించారు. బుధవారం స్థానికంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల కోసం రూ.3,006 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. అయితే వాస్తవంగా రూ.2,122 కోట్లు మాత్రమే విడుదల చేసి, అందులో రూ.961 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన రూ.1,161 కోట్లు ఇతర అవసరాలకు మళ్లించారని ఆయన ఆరోపించారు. మైనార్టీ గురుకులాలు, యువతకు స్వయం ఉపాధి, విదేశీ విద్యా స్కాలర్‌షిప్‌లు, మైనార్టీ స్టడీ సర్కిల్, షాదీ ముబారక్, హజ్ యాత్ర, ఇమామ్, మౌజన్‌ల వేతనాలు తదితర సంక్షేమ కార్యక్రమాలకు నిధులు పూర్తిస్థాయిలో వినియోగించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత బడ్జెట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీల కోసం రూ.3,700 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించిందని, గత నిధుల వినియోగంపై స్పష్టత లేకుండా కొత్త కేటాయింపులు ప్రకటించడం వల్ల మైనార్టీలకు ప్రయోజనం కలగదన్నారు. మైనార్టీల సంక్షేమంపై ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో సక్రమంగా వినియోగించాలని, ఇప్పటివరకు విడుదల చేసిన నిధులు, ఖర్చు చేసిన నిధుల




వివరాలతో బహిరంగంగా శ్వేతపత్రం విడుదల చేయాలని ఎండీ ఇలియాస్ పటేల్ డిమాండ్ చేశారు.



## తమ్మడపల్లిలో వేగంగా కొనసాగుతున్న భూముల రీ-సర్వే

○నిజాం కాలం నాటి మ్యాపులకు స్వస్తి..

○డిజిటల్ గ్రామ పటాల రూపకల్పనకు శ్రీకారం

**మర్రిగూడ, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాల్లో మరింత స్పష్టత తీసుకురావడంతో పాటు భూ రికార్డులను ఆధునికీకరించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామంలో గ్రామ పాత నక్ష నిర్ణయ ప్రక్రియను అధికారులు చేపట్టారు.రీ-సర్వేలో భాగంగా గతంలో అందుబాటులో ఉన్న నిజాం కాలం నాటి పాత మ్యాపులు, భూ రికార్డులను ప్రామాణికంగా పరిశీలిస్తూ ప్రస్తుత భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా గ్రామ పటాన్ని రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. పాత నక్ష ఆధారంగా గ్రామ సరిహద్దులు, భూముల విభజన, సర్వే నంబర్లు తదితర అంశాలను పరిశీలించి కొత్త డిజిటల్ మ్యాప్ రూపకల్పనకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం గ్రామానికి సంబంధించిన భూముల వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల పరిశీలన, భూ వివరాల నిర్వహణ వంటి అంశాల్లో మరింత పారదర్శకత, స్పష్టత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే డిజిటల్ మ్యాపులు ఉపయోగపడనున్నాయి.తమ్మడపల్లి గ్రామంలో చేపట్టిన పాత నక్ష నిర్ణయ కార్యక్రమాన్ని మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ పర్యవేక్షించారు. సర్వేయర్ స్వప్న క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. కార్యక్రమంలో తమ్మడపల్లి గ్రామ సర్పంచ్ కమ్మిచిచ్చు వెంకటేష్, గ్రామ పెద్దలు పాల్గొని రీ-సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించారు.పాత రికార్డుల ఆధారంగా కొత్త సాంకేతికతను అనుసంధానం చేస్తూ గ్రామ భూ వివరాలను డిజిటలైజ్ చేయడం రీ-సర్వేలో కీలకమైన అంశంగా మారింది. దీంతో భూముల వివరాలపై ప్రజలకు మరింత స్పష్టత లభించడంతో పాటు ప్రభుత్వ భూ పరిపాలనలో ఆధునికతకు దోహదం చేయనుంది.



## నల్లబోతు లింగయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 16( జనంసాక్షి):** మాడుగులపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన నల్లబోతు లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ గ్రామానికి చేరుకుని, లింగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, నివాళులర్పించారు అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పగిళ్ళ సైదులు, సర్పంచ్ వీరబోయిన నాగరాజు, ఉపసర్పంచ్ కొండల్, తవిటి సైదులు, బోడ మల్లేష్, బోడ యాదయ్య, కన్నెబోయిన నాగరాజు, నెర్సు శంకర్, నాగయ్య, బూర రమేష్, మందారపు రవి, మేకల నరేష్, కొండేటి నాగయ్య, లకుమాల మధు బాబు, పగడోజు సైదా చారి తదితర ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## టాస్కా మండల నూతన కమిటీ ఏర్పాటు

**మునగాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలోని టాస్క కార్యాలయ ప్రాంగణములో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్క) మండల నూతన కమిటీని సూర్యాపేట జిల్లా ఇంఛార్జి ఆరె రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మేదరమెట్ల వెంకటేశ్వరరావు(కొక్కిరేణి), అధ్యక్షులుగా భద్రంరాజు కృష్ణప్రసాద్(తాడువాయి), ఉపాధ్యక్షులుగా యలక మాధవరెడ్డి (మాధవరం), ఉప్పల పిచ్చమ్మ (మునగాల), ప్రధాన కార్యదర్శిగాగట్టు ఉపేందర్ (ఎస్.ఎం.పేట), సహాయ కార్యదర్శిగా, సోమపంగు జానయ్య (రేపాల), నర్రా వెంకటరెడ్డి, కోశాధికారిగా, శాఖమూడి సత్యనారాయణ (మాధవరం), ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా మండవ సత్యనారాయణ, యలక ప్రతాపరెడ్డి లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డా. వేపూరి సుదర్శన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.





## కష్టకాలంలో కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ నేత చలమల కృష్ణారెడ్డి అండ

### బొమ్మకంటి రామలింగమ్మ పెద్దకర్మకు రూ.50 వేల ఆర్థిక సహాయం

**చండూరు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ నేత చలమల కృష్ణారెడ్డి అండగా నిలిచారు. నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొమ్మకంటి సత్యనారాయణ తల్లి, కీర్తిశేషులు బొమ్మకంటి రామలింగమ్మ పెద్దకర్మ సందర్భంగా చలమల కృష్ణారెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యకర్తల కుటుంబాలకు తోడుగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బురకల భిక్షయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు గందు వెంకట్ గౌడ్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వంగూరు యాదయ్య యాదవ్, వడ్డేపల్లి భాస్కర్, సయ్యద్ జావిద్, పాలకూరి నాగరాజు గౌడ్, సొల్లేడు నరసింహ ముదిరాజ్, పంగ రామకృష్ణ యాదవ్, దేవా, జల్ల శీను, బొమ్మకంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయం

### కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి

**కొండమల్లేపల్లిసెప్టెంబర్ 16 (జనంసాక్షి)** కొండమల్లేపల్లి పట్టణం 12వ వార్డు బీసీ కాలనీకి చెందిన బీబీ కుమారుడు షోయబ్ గత కొంతకాలంగా



అనారోగ్యానికి గురయ్యారు. అతనికి కేఎంపి హెల్పింగ్ హాండ్స్ తరఫున దాతల సహకారంతో 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని చేయూతను అందించడం అభినందనీయమన్నారు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొడిదల వెంకటయ్య, ఏరుకొండ రాము ,కూన భానుచందర్, అందుగుల వెంకటేష్, వస్కుల శ్రీను, పర్వతం కొండల్, బిజిలి లింగం ,ఎండి లతీఫ్, పాల్వాయి సైదులు, బొడ్డుపల్లి మల్లికార్జున్, వస్కుల ప్రవీణ్, అందుగుల పరమేష్, దండు రవికుమార్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోంది

### సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

**నేరేడుచర్ల సెప్టెంబర్ 16 (జనంసాక్షి ):** వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరించే ప్రయత్నం చేస్తోందని సీపీఎం పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి విమర్శించారు. నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్న గ్రామంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సాయుధ పోరులో అమరులైన వారి స్తూపాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన మహోన్నత పోరాటమన్నారు.నిజాం నిరంకుశ పాలనకు, దేశ్ ముఖ్ లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో వేలాది మంది ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ పోరాటాన్ని కేవలం హైదరాబాద్ విమోచన ఉద్యమంగా చిత్రీకరించి,తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటోందని మండిపడ్డారు. సాయుధ పోరాటంలో బీజేపీకి, సంఘ్ పరివార్ కు ఎలాంటి పాత్ర లేదని, ఉన్న చరిత్రను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు.సెప్టెంబర్ 17ను ప్రజాస్వామ్య దినంగా కాకుండా విమోచన దినంగా పేరు మార్చి ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కందగట్ల అనంత ప్రకాష్, కొదమగుండ్ల నగేష్, నీల రామ్మూర్తి,మర్రి నాగేశ్వరరావు, అల్వాల శ్రీధర్,మామిడి నాగ సైదులు, బొప్పన రాణి,పాలకూరి రాములమ్మ, మచ్చా సోమయ్య, బుడిగే ధనుంజయ,సిరికొండ చిన్న శ్రీను, పర్సనబోయిన సైదులు,నందమూరి బాబురావు, సుంకరి వెంకటేశ్వరరావు, అనెగంటి మీనయ, కుంకు తిరుపతయ్య,పాతూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# అమర్ హై.. షోయబుల్లా ఖాన్

- జర్నలిజం అనే ఆయుధంతో నిజాం, రజాకార్ల దమనకాండపై పోరాటం..
- పాలేరు నియోజకవర్గంలో ఘన నివాళి..
- విమోచన దిన వారోత్సవాల్లో షోయబుల్లా ఖాన్ త్యాగస్ఫూర్తిని స్మరించిన భాజపా నాయకులు..

**తిరుమలాయపాలెం, సెప్టెంబరు 16,(జనంసాక్షి) :** నిజాం పాలన, ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జర్నలిజాన్ని ఆయుధంగా మలుచుకుని పోరాడి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ త్యాగాలను స్మరించుకుంటూబీజేపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని సుబ్లేడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





**ప్రజల కోసం కలాన్ని ఆయుధంగా మలిచి..**

నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న నిర్బంధం, రజాకార్ల అకృత్యాలపై షోయబుల్లా ఖాన్ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి బలిదానం చేసిన ఆయనను స్ఫూర్తిదాయక పాత్రికేయుడిగా కొనియాడారు. జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని, అన్యాయాన్ని ప్రశ్నించేందుకు కలం కూడా శక్తిమంతమైన ఆయుధమేనని షోయబుల్లా ఖాన్ తన జీవితంతో నిరూపించారని వారు పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసిన ఆయన త్యాగాన్ని నేటితరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**విమోచన దిన వారోత్సవాల్లో కార్యక్రమం**

తెలంగాణ విమోచన దిన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖమ్మం జిల్లా భాజపా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, భాజపా కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రవికుమార్ నున్న, రాష్ట్ర నాయకుడు రుద్ర ప్రదీప్, శామ్ రాథోడ్, తక్కెళ్లపల్లి నరేంద్రరావు, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పలువురు నాయకుల హాజరు**

జిల్లా నాయకులు అనంతు ఉపేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అనగాని రామారావు, మల్లారెడ్డి, మండల అధ్యక్షులు బొడ్డు ప్రసాద్, పాగర్తి సుధాకర్, పుణ్యవతి, సత్తి నాగరాజుతో పాటు పలువురు భాజపా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా షోయబుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ 'అమర్ హై' అంటూ నినదించారు. తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటితరానికి తెలియజేయడంతో పాటు, స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుల త్యాగాలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.



## రైతులు సహజ సాగు పద్ధతులను అవలంబించాలి

### వ్యవసాయ అధికారి మాధవి రెడ్డి

**గుర్రంపోడు సెప్టెంబర్ 16 (జనంసాక్షి)** ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటలను సాగు చేయాలని హాలియా వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత రైతులకు సూచించారు. తానేదారిపల్లి రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల నాణ్యతను పెంచుకోవచ్చని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని వాటిని ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గుర్రంపోడు వ్యవసాయ అధికారి మాధవ రెడ్డి, ఏఈఓ, తానేదారిపల్లి సర్పంచ్ కంచర్ల యాదమ్మ, జిన్నాయిచింత సర్పంచ్ వడ్లమల్ల పుష్పలత, ఉప సర్పంచ్‌లు పాల్వాయి ఏడుకొండలు, కట్టేబోయిన వెంకటయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నూతన భవనానికి భూమిపూజ



**మునగాల, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** మండల పరిధిలోని సీతానగరం గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాదావత్ వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ వీరయ్య మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మాణం పూర్తయితే చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వసంత, గ్రామపంచాయతీ కార్యదర్శి నవిత, విజయరాఘవపురం సర్పంచ్ సుంకర పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పల్లపు సతీష్, మాజీ సర్పంచ్ కొల్లు వరప్రసాద్ రావు, పడిశాల నాగరాజు, లెక్కల సుధాకర్, పుల్లూరు మైసయ్య, సూరపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు పుల్లూరు శివాజీ, సిరపంగి వినయ్, సురపల్లి స్వామి, ఎన్ఎస్యూఐ అధ్యక్షులు గోగుల లక్ష్మణ్ , పల్లపు విశ్వేశ్వరరావు, పడిశాల ఉదయ్ , పల్లపు ఎంకన్న, పుల్లూరు పెద్ద రామయ్య, వరుకుప్పల ఎల్లయ్య, వరికుప్పల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### మెగా జాబ్ మేళాను అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు

## సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి

**నేరేడుచర్ల సెప్టెంబర్ 16( జనంసాక్షి):** ఈనెల 19వ తేదీన శనివారం రోజున కోదాడలో నిర్వహించే మెగా జాబ్ మేళాకి అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కోణతం చిన్న వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పట్టిపీడిస్తున్నటువంటి విషయాలలో నిరుద్యోగ సమస్య అనేది చాలా ఇబ్బందికరంగా మారింది అటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని సిసి రెడ్డి కాన్వెంట్లో నిర్వహించబడే మెగా జాబు మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవలసిందిగా కోరారు. సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 300 కంపెనీలు ఈ యొక్క జాబ్ మేళాకి హాజరవుతున్నరని, గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాబ్ మేళాలో 200 కంపెనీలు పాల్గొంటే సుమారు 3000 మంది నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి నిరుద్యోగ యువతీ యువకుల కొరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,పద్మావతి చేస్తున్నటువంటి కృషి చాలా అభినందనీయం వారికి నేరేడుచర్ల మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ జాబ్ మేళాలో అర్హులైనటువంటి నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కట్ట రామారావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రాచకొండ అజయ్ ,మత్స్యశాఖ చైర్మన్ యామిని వీరయ్య, కౌన్సిలర్లు ఇంజమూరి శ్రీకాంత్, నన్నేపంగ శ్రీనివాస్ ,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి ,మాజీ కౌన్సిలర్ నాగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట సైదులు, మార్కెట్ మాజీ డైరెక్టర్ మచ్చ, శ్రీను, కర్ణం పాండయ్య, రామిరెడ్డి వినోద్, తదితరులు పాల్గొన్నారు.






## కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**సూర్యాపేట(జనంసాక్షి):** కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శరభాచారి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన శరభాచారికి శుభాకాంక్షలు తెలియజేసి, కార్పెంటర్ కార్మికుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు.


## దసురు నాయక్ కుటుంబానికి అండగా నరసింహారెడ్డి

### రూ.25 వేల ఆర్థిక సాయం.. పిల్లల చదువుల బాధ్యత నాదేనని భరోసా

**చందంపేట సెప్టెంబర్ 16(జనంసాక్షి)** మండలంలోని బొడ్డోనితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నేనావత్ దసురు నాయక్ రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దసురు నాయక్ స్వగృహానికి వెళ్లిన ఆయన, మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దసురు నాయక్ పిల్లల చదువులకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ దసురు నాయక్ మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన సహాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, సర్పంచ్ చిట్టెమ్మ లాల్ సింగ్, మాజీ సర్పంచ్ బాలు, మాజీ ఉప సర్పంచులు యాదయ్య, బాలు, డైరెక్టర్ అంకులయ్య, ఇప్ప తిరుపతిరెడ్డి, చాట్ల వెంకటయ్య, వార్డు సభ్యులు వెంకటాచారి, ఆంజనేయులు, చాట్ల బలరాం, బడేటి కిష్టయ్య, పోలగొని వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.







# సేవా సంకల్ప్ అభియాన్‌తో నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు

- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాజీవితానికి గుర్తుగా కేంద్రం కార్యక్రమం..
- సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు..
- 22ఏ భూముల లెక్కలపై శ్వేతపత్రం విడుదల చేయాలి..
- బిజెపి జాతీయ నాయకులు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి..

**ఖమ్మం, సెప్టెంబర్ 16, (జనంసాక్షి) :**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్‌ను తెలంగాణలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు, కర్ణాటక?తమిళనాడు రాష్ట్రాల కో?ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెలరోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే అభియాన్ లక్ష్యమని చెప్పారు. ఖమ్మంలోని భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సేవే సంకల్పంగా.. నెలరోజుల కార్యక్రమాలు**
సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, ఆరోగ్య శిబిరాలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ సేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడమే ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు**
విద్యార్థుల్లో దేశభక్తి, దేశ నిర్మాణంపై అవగాహన పెంచేలా వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు 'నా కలల భారతదేశం' అంశంపై వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళలకు రంగోలి పోటీలు, యువతకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి శక్తి కేంద్రం పరిధిలో సేవా జ్యోతి ర్యాలీలు నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

**సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మమేకం**
కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులను నేరుగా కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకునే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఉచిత రేషన్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జనధన్ ఖాతాలు తదితర పథకాల లబ్ధిదారులతో పార్టీ శ్రేణులు మమేకం కానున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించడమే అభియాన్‌లోని ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.

**తెలంగాణ విమోచన దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యం**
సెప్టెంబరు 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన నుంచి విముక్తి పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ, ఆ పోరాటంలో పాల్గొన్న యోధుల త్యాగాలను గుర్తుచేసుకునే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌తో ఈ కార్యక్రమాలను అనుసంధానిస్తూ ప్రజల్లో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

**22ఏ భూముల లెక్కలపై శ్వేతపత్రం**
సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను వెల్లడించిన అనంతరం రాష్ట్రంలోని భూ సమస్యలపై సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధరణి నుంచి భూ భారతి వరకు భూ రికార్డుల నిర్వహణలో చోటుచేసుకున్న మార్పులు, 22ఏ నిషేధిత భూముల జాబితా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పెండింగ్ ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 22ఏ భూములపై ప్రభుత్వం చెబుతున్న గణాంకాలకు, రాజకీయంగా ప్రచారంలో ఉన్న ఇతర లెక్కలకు మధ్య వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబరు వారీగా పూర్తి వివరాలను బహిరంగపరచాలని, ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేస్తే అనుమానాలకు తావుండదని అన్నారు.



**47,440 ఎకరాల తగ్గుదలపై వివరణ కోరిన సుధాకర్‌రెడ్డి**
రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో వెల్లడించిన వివరాల ప్రకారం 2023 డిసెంబరు 7న 22ఏ జాబితాలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, 2026 ఆగస్టు 31 నాటికి 1,02,05,250 ఎకరాలకు తగ్గినట్లు, అంటే 47,440 ఎకరాల నికర తగ్గుదల నమోదైనట్లు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే జాబితాలోకి కొత్తగా ఎంత భూమి చేరింది, ఎంత భూమిని తొలగించారు, ఏ కారణాలతో తొలగించారు, ప్రభుత్వ భూమి ఎంత, దేవాదాయ భూమి ఎంత, ప్రైవేటు పట్టా భూమి ఎంత అనే వివరాలు కూడా ప్రజలకు తెలియాలని కోరారు. కేవలం మొత్తం విస్తీర్ణం తగ్గుదలను చూపించడం కాకుండా సర్వే నంబరు స్థాయి వరకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**ఖమ్మంలో 980 భూ ఫిర్యాదులు**
ఖమ్మం జిల్లాలో సర్వేలు, సరిహద్దులు, భూ రికార్డులకు సంబంధించిన సుమారు 980 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. భూ సమస్యలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటే రైతులు, కుటుంబాలు, ఆస్తి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. రాజకీయ కోణంలో కాకుండా రికార్డులను పరిశీలించి చట్టబద్ధంగా ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని సూచించారు.

**ప్రభుత్వ, దేవాదాయ భూములకు రక్షణ**
ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. అదే సమయంలో రికార్డుల పొరపాట్ల కారణంగా చట్టబద్ధమైన ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలో చిక్కుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. భూ రికార్డుల్లో తప్పులు జరిగితే వాటి ప్రభావం విక్రయాలు, వారసత్వ బదలాయింపులు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల భూ పరిపాలనలో ఖచ్చితత్వం, పారదర్శకత, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**మెగా ఫుడ్‌పార్క్‌పైనా వివరాలు ఇవ్వాలి**
ఖమ్మం ప్రాంతానికి సంబంధించిన మెగా ఫుడ్‌పార్క్ వ్యవహారంపైనా సుధాకర్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. దీపక్ నైట్రేట్ సంస్థ సుమారు రూ.600 కోట్ల పెట్టుబడితో చేపడుతున్నట్లు చెబుతున్న ప్రాజెక్టుకు సంబంధించిన పెట్టుబడి ప్రతిపాదనలు, భూముల కేటాయింపు, అనుమతులు, ప్రాజెక్టు ప్రయోజనాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ వ్యవహారంలో అనుమానాలుంటే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థ నుంచి స్వతంత్రంగా ధ్రువీకరించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించాల్సి ఉంది.

**భూ సమస్యలు రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలి**
ధరణి, భూ భారతి, 22ఏ అంశాలను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సుధాకర్‌రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పులు ఉంటే వాటిని సరిదిద్దాలని, ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలను పూర్తి గణాంకాలతో ప్రజలకు వివరించాలని కోరారు. జిల్లా, మండలం, గ్రామం, సర్వే నంబరు స్థాయిలో భూ రికార్డులను పారదర్శకంగా అందుబాటులో ఉంచితే ప్రజలకు మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ ఫిర్యాదులను కాలపరిమితిలో పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, గుత్తా వెంకటేశ్వర్లు, గోగూర వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, మంద సరస్వతి, శ్రీరామనేని మణి, మాధవ్, రవి గౌడ్, కుమిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెంటాడే కలాలు" జన్మస్థలి కోదాడ

## తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్‌జూలూరు గౌరీ శంకర్..



కోదాడ,( జనం సాక్షి):
తెలుగు సాహిత్య చరిత్రలో ఒక అధ్యాయంగా నిలచిన "వెంటాడే కలాలు– వెనుకబడిన కులాలు" సంకలనానికి కోదాడ జన్మస్థలి కావడం గర్వకారణంగా ఉందని పుస్తక సంపాదకుడు, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. ఓనమాలు దిద్దించి నడక నేర్పిన నడిగూడెం, సామాజిక స్పృహనందించిన కోదాడ మట్టిస్ఫూర్తితోనే "వెంటాడే కలాలు" సంకలనం తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20న జరిగే బీసీ కవుల అలాయ్ బలాయ్ "వెంటాడే కలాలు" పుస్తక రజతోత్సవ సందర్భంగా కోదాడలో బుధవారం నాడు రాయపూడి చిన్ని, బంగారు నాగమణి, వేముల వెంకటేశ్వర్లు, బాణాల వసంత, సిరికొండ శ్రీనివాస్, పుప్పాల కృష్ణమూర్తి, సరికొండ నరసింహారాజు తదితరుల నేతృత్వంలో రజతోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ... 2001లో పల్లెలు చిద్రమై, కులవృత్తులు ధ్వంసమై, బడుగుల బతుకులు అల్లకల్లోలమైపోతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో "వెంటాడే కలాలు" సంకలనం తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో 23 మంది బీసీ కవులు తమ ఆత్మకథనాత్మక వ్యధల్ని ఆవిష్కరించారని అన్నారు. చారిత్రాత్మకమైన రాష్ట్రస్థాయి దళిత సాహిత్య సదస్సుకి 1995లో కోదాడ పట్టణమే ఆతిథ్యమిచ్చి నిర్వహించిందని గుర్తు చేశారు. 1935 ల నుంచే నడిగూడెంకు గొప్ప సాహిత్య చరిత్ర ఉందన్నారు. రాజా నాయని వెంకట రంగారావు నడిగూడెం సంస్థానం నుంచే విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి పేరున 60 పుస్తకాలు వెలువరించడం జరిగిందని సింహావలోకనం చేశారు. హైదరాబాదులో 20న జరిగే "వెంటాడే కలాలు రజతోత్సవ సభకు" రాష్ట్రం నలుమూలల నుంచి మూడు 300కు పైగా బీసీ కవులు హాజరవుతారని జూలూరు గౌరీశంకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా పుస్తక సంపాదకులు కవి జూలూరు గౌరీశంకర్ ను త్రివేణి, వాగ్దేవి, రేస్ కళాశాలల చైర్మన్ బాణాల వసంత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో... రామ నరసయ్య, హరి కిషన్, పొట్ట జగన్నాథం, షేక్ మీరా,డి.ఎన్. స్వామి, జి.ఎల్.ఎన్ రెడ్డి, జూలూరు వీరభద్రం, బాదేరాము,కొలిచలం శ్రీనివాస్, త్రివేణి డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

# కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**సూర్యాపేట(జనంసాక్షి):**
కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శరభాచారి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన శరభాచారికి శుభాకాంక్షలు తెలియజేసి, కార్పెంటర్ కార్మికుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు.



## బుల్లెట్ ట్రైన్ సాధనకై సూర్యాపేట బంద్ ను విజయవంతం చేయాలి

### అఖిలపక్షాల ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ



సూర్యాపేట(జనంసాక్షి):
బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 18న అఖిలపక్షాల ఆధ్వర్యంలో తలపెట్టిన సూర్యాపేట బందును విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు.బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ నెల 18న నిర్వహించనున్న సూర్యాపేట బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.గత 60 రోజులుగా పట్టణంలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమ కార్యక్రమాలతో పాటు 34 రోజులుగా దీక్ష కొనసాగుతుందని అయినా పాలకులు స్పందించకపోవడంతో బందుకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.ప్రజలు, వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు అన్ని వర్గాల సంఘాల భాగస్వామ్యంతో ఈ బందుకు పిలుపునిచ్చినట్లు ప్రకటించారు.పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా బందు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.ప్రైవేట్ విద్యా సంస్థలు,వాణిజ్య వ్యాపార సంస్థలు, ఈ బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలంతా బుల్లెట్ ట్రైన్ సాధనే లక్ష్యంగా ఈ బందుకు సహకరించాలని కోరారు.నేటి సాయంత్రం బంద్ విజయవంతం కోసం బైక్ ర్యాలీ ఉంటుందని, శుక్రవారం పట్టణంలో బంద్ ప్రశాంతంగా నిర్వహించేందుకు శాంతియుత ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.గత రెండు రోజులుగా పట్టణంలోని వివిధ వ్యాపార, కార్పొరేట్ సంస్థలకు బందుకు సంబంధించిన వినతి పత్రాలను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్, రమణాచారి, ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, బూర మల్సూర్ గౌడ్, సలిగంటి వీరేంద్ర, బూర వెంకటేశ్వర్లు, కురుకుంట్ల సైదులు, సకినాల కృష్ణ, జీడి బిక్షం, కోడి లింగయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## హాలియా పరిధిలో వినాయక నిమజ్జనానికి పటిష్ట పోలీస్ బందోబస్తు



**హాలియా, సెప్టెంబర్ 16 జనంసాక్షి :**
హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టి, నిరంతర పోలీస్ గస్తీ మరియు నిఘాను ఏర్పాటు చేసినట్లు హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపారు.
నల్గొండ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, మిర్యాలగూడ డీఎస్పీ జి.రవి మరియు హాలియా సీఐ ఎస్.రాఘవరావు పర్యవేక్షణలో వినాయక నిమజ్జనానికి సంబంధించిన భద్రతా చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.
హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 211 వినాయక మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాయని తెలిపారు. నమోదు చేసిన ప్రతి మండపం యొక్క భౌగోళిక స్థానాన్ని గుర్తించి జియో ట్యాగింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. దీంతో మండపాల వద్ద పోలీసుల పర్యవేక్షణ, గస్తీ మరియు నిమజ్జన సమయంలో భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు.
వినాయక చవితికి ముందుగానే రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతో పాటు, డీజే నిర్వాహకులు మరియు యజమానులను కూడా బైండోవర్ చేసి శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.హాలియా పట్టణం, అనుముల మండల పరిధిలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ప్రత్యేక పోలీస్ గస్తీ నిర్వహిస్తున్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది, పోలీస్ గస్తీ వాహనాలు మరియు హాలియా పోలీస్‌స్టేషన్ సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.అలీనగర్ చెక్‌పోస్ట్ సమీపంలోని 14వ మైలు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో చేపడుతున్నారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు.నిమజ్జనం సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో సంగీతాన్ని వినిపించరాదని వినాయక మండపాల నిర్వాహకులకు పోలీసులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను వినియోగించినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ హాలియా పట్టణం మరియు అనుముల మండల పరిధిలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు, నిరంతర గస్తీ మరియు నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను పాటిస్తూ శాంతి యుతంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలని నిరసన ర్యాలీ

**మధిర, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**




పాలిటెక్నిక్ విద్యార్థులకు తీవ్రమైన నష్టం కలిగించే జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం పాలిటెక్నిక్ కళాశాల ఖాజీపురం నుండి ఆత్కూరు రింగ్ రోడ్డు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్ అనిల్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి చేతులు దులుపుకునే కుట్ర చేస్తుందని అన్నారు. శక్తి పథకం తీసుకువచ్చి అందులో పాలిటెక్నిక్ విద్యను కలిపి వేసి ప్రైవేట్ కంపెనీలకు కావాల్సిన వర్కర్స్ ను తయారు చేసుకునే విధంగా పథకాన్ని మార్చి విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రమైన ఉద్యమాలు నిర్వహిస్తారని హెచ్చరించారు. విద్యార్థులు ఎన్నో ఆశలతో పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉన్నత చదువులను అభ్యసించేందుకు ఉన్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉన్న అధికారంతో కాలరాయటం దుర్మార్గమైన చర్య అని అన్నారు ఈ చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న ఆందోళనను ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని కోరారు. జీవో నెంబర్ 97ను వెనుక తీసుకునే అంతవరకు దశల వారి ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిదర్శనం - హర్ష కేతన్ ఫౌండేషన్ ప్రారంభం

### మధిర టౌన్ ఎస్ఐ నవిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**మధిర, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
సమాజ సేవే లక్ష్యంగా హర్ష కేతన్ ఫౌండేషన్ ను బుధవారం మధిరలో ఘనంగా మధిర టౌన్ ఎస్ఐ నవిత ముఖ్య అతిథిగా హాజరై ఫౌండేషన్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నవిత మాట్లాడుతూ.. హర్ష కేతన్ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు విద్య, నిరుపేదలకు అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. సమాజంలో అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు.
ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు పుస్తకాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్ఐ నవిత గారు తమ ఫౌండేషన్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లంకా కొండయ్య గారు, సర్పంచ్ సిద్ది పోగు ప్రసాద్ గారు, పుతుంపాక కృష్ణ ప్రసాద్ గారు ఎమ్మార్పీఎస్ నాయకులు దాస్ గారు ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### నష్టపరిహారం కోసం మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా

**నేరేడుచర్ల సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**
మండలంలో దిర్శించర్ల గ్రామంలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు.మూడు రోజుల క్రితం కొత్తగా స్లాబ్ నిర్మిస్తున్న సమయంలో అంతని సావిత్రి అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో మృతి చెందాడు.మృతుడి కుటుంబానికి ఎంతో కొంత నష్టపరిహారం అందిస్తామని రెండు రోజుల క్రితం హామీ ఇచ్చినప్పటికీ,మూడో రోజు అంత్యక్రియలు నిర్వహించే సమయంలో నష్టపరిహారం ఇవ్వబోమని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగినట్లు తెలిపారు.తమకు న్యాయం చేసి నష్టపరిహారం చెల్లించే వరకు ధర్నా విరమించేది లేదని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

### అర్వపల్లి లో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

జాజిరెడ్డిగూడెం మండల **(జనంసాక్షి):**
ఖమ్మంలో ఈనెల 28 29 30 తేదీలలో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, సహాయ కార్యదర్శి సంపద కాశయ్య కోరారు. బుధవారం అర్వపల్లి లో ఏఐకే ఎం ఎ స్ జాతీయ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలేబోయిన కిరణ్, పంపు అమృతి, ఉప్పలయ్య, రమేష్, సాంబయ్య, పల్లెర్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**సూర్యాపేట(జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే ప్రతి ఒక్కరు పూజించాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాసులు అన్నారు.జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వినాయక చవితిని పురస్కరించుకొని ఆర్యవైశ్య పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి రమేష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి హాని జరిగి నీటి కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా మట్టి గణపతి విగ్రహాలను పూజిస్తే భవిష్యత్ తరాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సోమ వెంకన్న, రాచకొండ శ్రీనివాస్, కందిబండ ఉమామహేశ్వరావు, కక్కిరేణి ప్రసాద్, తల్లాడ ప్రవీణ్, అడ్డగూడూరు శ్రీనివాస్, కలకోట లక్ష్మయ్య, అనిత, నరేంద్రుని శ్రీధర్, సెక్రటరీ లకుమారపు పద్మజ, బెలిదే లక్ష్మి, చల్లా హేమలత, ఓరుగంటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ హరి సింగ్ పరిశీలన

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంపై బుధవారం అర్వపల్లి లోని తాసిల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ హరిసింగ్ సమీక్షించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి బి ఎల్ ఓలు తగు ఆధారాలు సేకరించి ఓట్లు తొలగించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బాషపాక శ్రీకాంత్, నాయబ్ తహసిల్దార్ సమ్మెట అశ్వని, గిర్దావర్లు పాటి వెంకటరెడ్డి, పెరుమాళ్ళ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.





## సీతాయిగూడెంలో భూ రీ-సర్వే

**చంద్రుగొండ, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామంలో భూముల సరిహద్దులను గుర్తించే ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి. మధు, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ ప్రణాళిక అధికారి (జీపీఓ)తో పాటు సంబంధిత రైతులు పాల్గొన్నారు. అధికారుల సమక్షంలో భూముల సరిహద్దులను పరిశీలించి, రీ-సర్వే ప్రక్రియలో భాగంగా అవసరమైన వివరాలను నమోదు చేశారు. రైతుల సమక్షంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు.

## ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయండి




**టేకులపల్లి,సెప్టెంబర్ 16(జనంసాక్షి):**
అఖిల భారత రైతు కూలీ సంఘం( ఏఐకేఎంఎస్) జాతీయ మహ సభలు సెప్టెంబర్ 28, 29,30 తేదీలలో ఖమ్మంలో జరగనున్నాయని వీటిని జయప్రదం చేయాలని కోరుతూ మహాసభల గోడ ప్రతులను రోల్లపాడు గ్రామంలో మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల అధ్యక్షులు గుగులోత్ రామచంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసా య నూతన చట్టాలను అమలులోకి తీసుకువచ్చి రైతులపై ఆర్థిక దాడికి పాల్పడుతుందని అన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం కల్పించే సబ్సిడీపై కోత విధించుతూ రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు.ఈ మహాసభలో భారత రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోనున్నందున 28వ తారీకు జరుగు భారీ బహిరంగ సభ 29, 30 తేదీలలో జరుగు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడెం రవి,చీమల భద్రయ్య, పూణెం రామస్వామి,కొడెం ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలి

**ఖమ్మం డిపోవద్ద ఎస్ డబ్ల్యు ఎఫ్ ధర్నా డిమాండ్**

**డిఎం కార్యాలయంలో వినతిపత్రం**

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 16 ( జనం సాక్షి )**
ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47 వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సిహెచ్.వి.రామయ్య స్మారక భవనం వద్ద ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు పతాకావిష్కరణ చేయగా ప్రతినిధులం దరూ పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు.అనంతరం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపో వద్ద కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలని,స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.గద్దం వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గద్దం లింగమూర్తి మాట్లాడుతూ, తెలంగాణ ఆర్టీసీలో కార్మికులపై యాజమాన్య విధానాల వలన విపరీతమైన పని భారం పెరిగిందన్నారు.రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు,కార్మికులకు రావలసిన 2017 మరియు2021 పిఆర్సీ ఏరియర్స్ ఇవ్వాలని,అన్ని కేటగిరీ లలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని,ఆర్టీసీ కి నష్టాలు అధికారుల అనాలోచిత చర్యల వల్లనే తప్ప కార్మికులు కాదని తెలియజేశారు.స్థానిక యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాలని లింగమూర్తి పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో ఆర్.వి.బాబు,ఓ.రాంబాబు, ఎస్.ఎస్.రామయ్య,జే.యు.చారి, పగిళ్లపల్లి నరసింహారావు, సి.హెచ్. వీరయ్య, కె. వెంకన్న, ఐ.ముత్తయ్య, జి.వెంకటేశ్వర్లు, కే.శ్రీను,వీరేందర్ రావు,యన్సీ చారి,ఏ.శ్రీనివాసు,డి. నాగయ్య,రాజనాల నాగమల్లేశ్వరరావు, బి సుధాకర్,ఎం.వసంత రెడ్డి,రంగా రామారావు,ఎం.వెంకటేశ్వర్లు,పి. విజయ్ కుమార్,కృష్ణమూర్తి కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ హక్కుల కోసం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

**- తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు సీపీఐ ఘన నివాళి**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సారపాక ప్రతిభవన్‌లో సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1946?1951 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిజాం పాలనలో కొనసాగిన భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లు, రైతులపై అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం చరిత్రలో కీలక అధ్యాయంగా నిలిచిందన్నారు. ఈ ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఆంధ్ర మహాసభను ప్రజా వేదికగా వినియోగించుకుని గ్రామీణ ప్రాంతాల్లో రైతులను సంఘటితం చేశామని, వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ పన్నులు?వసూళ్లకు వ్యతిరేకత, భూమి సమస్య, రైతుల హక్కుల కోసం ప్రజలను సమీకరించామని ఆయన పేర్కొన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా విస్తృత రైతాంగ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉందన్నారు. ఉద్యమంలో మహిళలు కూడా గణనీయంగా పాల్గొన్నారని, గ్రామాల్లో ప్రజా సంఘాలు ఏర్పడి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశాయని చెప్పారు. భూమి, రైతుల హక్కులు, వెట్టిచాకిరీ నిర్మూలన, సామాజిక న్యాయం వంటి అంశాలను తెలంగాణ రైతాంగ పోరాటం దేశవ్యాప్త రాజకీయ చర్చల్లోకి తీసుకువచ్చిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సబ్బం నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పేరాల శ్రీనివాసరావు, సిద్దారపు సుబ్బారెడ్డి, వి.వి.బి.చారి, పాండవుల బిక్షం, బర్ల వెంకటేశ్వర్లు, గుగులోతు బీమా, ఏఐటీయూసీ నాయకులు ఎండి షాజిద్, జహీర్, వెంకటరెడ్డి, వేణు, వహీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన సమస్యలపై గులాబీ సైన్యం సమరభేరి

**- 18న దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో రోడ్ల దిగ్బంధనం**

**- రావులపల్లి రాంప్రసాద్**



**భద్రాచలం సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**
ఏజెన్సీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం గులాబీ సైన్యం మరో పోరాటానికి సిద్ధమవుతోందని బీఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తోందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో వేలాది ఇసుక లారీల రాకపోకల కారణంగా ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని రాంప్రసాద్ అన్నారు. రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇసుక లారీల రాకపోకలపై నియంత్రణతోపాటు ధ్వంసమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం సరికాదని రాంప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే మౌనం వీడి ఏజెన్సీ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. రహదారుల దుస్థితి, ఇసుక లారీల సమస్య, రైతాంగానికి సంబంధించిన సాగునీటి సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 18న దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో రోడ్ల దిగ్బంధనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. చర్ల మండలం కుదునూరు గ్రామంలో, దుమ్ముగూడెం మండలం సీతారాంపురం గ్రామంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ రైతాంగానికి ప్రధాన ఆయకట్టుగా ఉన్న తాల్లిపేరు ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం మౌనం వీడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాల్లిపేరు ప్రాజెక్టు ద్వారా చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా తూరుబాక వరకు నీరు అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని అన్నారు. తాలిపేరు ఎడమ, కుడి కాలువల పరిధిలో ఉన్న చెరువులను ప్రాజెక్టు నీటితో నింపాలని మానే రామకృష్ణ డిమాండ్ చేశారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరగడంతోపాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.



## సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో

## శ్రీ విద్య దొరకు స్వర్ణ పతకం

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 16(జనంసాక్షి):**
ఇండియన్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో పాండిచ్చేరిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చర్లకు చెందిన క్రీడాకారిణి శ్రీ విద్య దొర సత్తా చాటారు.తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన శ్రీ విద్య దొర అండర్?16 విభాగంలోని 80 మీటర్ల హర్డిల్స్ పోటీలో 12.21 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని స్వర్ణ పతకం బుధవారం సాధించారు. ఈ విజయంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా రంగానికి ఆమె గర్వకారణంగా నిలిచారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే. మహీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ విద్య దొరకు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కే. సారంగపాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. వెంకటేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ అథ్లెటిక్స్ కోచ్ సునంద కోరి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి, కోచ్ జె. గిరి ప్రసాద్, అథ్లెటిక్స్ కోచ్‌లు పి. నాగేందర్, డి. మల్లికార్జున్ రావు తదితరులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## పొంగులేటి పైబిఆర్ఎస్ అనుచిత వ్యాఖ్యలు తగదు

**మాజీ జడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్ ఆగ్రహం**

**అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకే విమర్శలని ధ్వజం**



**కామేపల్లి, సెప్టెంబర్ 16(జనం సాక్షి):**
-రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను మాజీ జడ్పీటీసీ,డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా,రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సంచలనాత్మక నిర్ణయాలతో ముందుకు సాగుతుంటే ఓర్వలేకనే విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. బుధవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రెవెన్యూ వ్యవస్థలో మంత్రి పొంగులేటి విప్లవాత్మక ప్రక్షాళన చేస్తూ ప్రజలకు పాలనను చేరువ చేస్తున్నారని పేర్కొన్నారు.తమ ఉనికి ఎక్కడ కోల్పోతామోనన్న భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు.తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. రూ. 1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును అవినీతిమయం చేసి,బీఆర్ఎస్ నేతలకు ఏటీఎంగా మార్చుకున్నారని ఆరోపించారు. 58, 59 జీవోల పేరుతో ఖాళీ భూములను కబ్జా చేశారని మండిపడ్డారు.గతంలో ధరణి పోర్టల్ పేరుతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కఠినమైన నిబంధనలతో సామాన్యులకు భూ రిజిస్ట్రేషన్లు కాకుండా నరకం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ లోప భూయిష్టమైన ధరణి స్థానంలో సామాన్యులకు సైతం సులభంగా, పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి'ని తీసుకువచ్చిందని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేని ప్రతిపక్ష నేత ఉండటం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు.ఈ కార్యక్రమంలో బండిపాడు గ్రామ పంచాయతీ బాధ్యులు గుగులోతు రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు,వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు దేరంగుల తిరపయ్య,బండి ఉపేందర్,తురక బిక్షం,మొగిలి శ్రీను, చల్ల మల్లయ్య, పగిడిపల్లి రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.